క్లుప్తంగా

యోగా మందిరం ప్రారంభం



యోగా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గుంతకల్లు: పట్టణంలోని కన్యాకా పరమేశ్వరీదేవి ఆలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన యోగా మందిరంతోపాటు పరిపాలన భవనాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోపా జగదీష్, కందూరి కృపాకర్‌తో పాటు ఆర్యవైశ్యులు హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా ఇక్కడ యోగా ఆచరిస్తున్నారన్నారు. వారి సౌకర్యార్థం ప్రత్యేకంగా యోగా మందిరం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.

ఏపీఎంగా శివకుమార్

పెద్దపప్పూరు: డీఆర్‌డీఏ వెలుగు పెద్దపప్పూరు ఏపీఎంగా శనివారం శివకుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రవిచంద్రరాజు పెనుగొండకు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో అనంతపురంలో పనిచేస్తున్న శివకుమార్ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ సంఘాల బలోపేతానికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.కార్యక్రమంలో సీసీ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల డైరెక్టర్

తాడిపత్రి రూరల్: తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని శనివారం టాప్ అకాడమీ హెచ్‌ఆర్ నవీన్ తెలిపారు. ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, డైరెక్టర్ నటరాజేశ్వరరెడ్డి, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ అధికారి లక్ష్మీకాంతరెడ్డి, జబీర్‌బాషా తదితరులు విద్యార్థులను అభినందించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి

బుక్కరాయసముద్రం: మండలంలో మద్యం దుకాణాల నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ నాగ సునీత సూచించారు. శనివారం బీకేఎస్ మండల కేంద్రంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. శింగనమల, గార్లదిన్నె బీకేఎస్, నార్పల మండలాలకు సంబంధించిన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 మద్యం దుకాణాలకు ఈ నెల 9 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు రుసుం రూ .2 లక్షలు చెల్లించాలన్నారు. లాటరీ పద్ధతి ద్వారా మద్యం షాపులు కేటాయిస్తామన్నారు. చివరి నిమిషంలో టెక్నికల్ సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున 9వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు బీకేఎస్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ గురురాజ్ భట్‌ను సంప్రదించాలన్నారు.

జూదరుల అరెస్టు

యాడికి: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి, నిందితుల నుంచి రూ6,260ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలోని కుంట వీధిలో కొంత కాలంగా పేకాట ఆడుతున్నారనే సమాచారం రావటంతో పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశామన్నారు.

శనీశ్వరుడికి పూజలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన శనీశ్వరుడి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో ప్రధాన అర్చకుడు బాబ స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కుంకుమాభిషేకం, అర్చనలు నిర్వహించారు.

వరికి అగ్గి తెగులు

- ఆందోళనలో రైతులు
- సూచనలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు



అగ్గి తెగులు సోకిన వరి

గార్లదిన్నె: వరికి అగ్గి తెగులు సోకడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 20 వేల ఎకరాల్లో వరిసాగులో ఉన్నట్లు వ్యవసాయాధికారుల అంచనా. గార్లదిన్నె మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో బోర్ల కింద 4500 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. సాగు చేసిన వరి పంట పొట్ట దశకు చేరుకుంది. ప్రస్తుతం వరి పంటలో అగ్గి (ఎండు) తెగులు విజృంభిస్తోంది. కేశవాపురం, ముంటిమడుగు, కొప్పలకొండ, కల్లూరు, కమలాపురం, ఇల్లూరు గ్రామాల్లో సాగు చేసిన వరి పంటకు అగ్గి తెగులు సోకి వరి దుబ్బు చుట్టూ ఉన్న ఆకులు పసుపు రంగులోకి మారి, ఎండిపోయి చనిపోతున్నాయి. వరి దుబ్బులు బలహీన పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక పొలం నుంచి మరో పొలానికి ఎండు తెగులు వేగంగా వ్యాప్తి చెందుతోంది. అప్పులు చేసి వరి పంటకు పెట్టుబడి పెట్టామని, అగ్గితెగులుతో దిగుబడి తగ్గే అవకాశం ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

అగ్గి తెగులు వ్యాప్తి ఇలా..

తెగులు సోకిన మొక్కల ఆకులు బూడిద రంగు చారికలు ఏర్పడి, వాటి నుంచి తెల్లగా జిగురు పదార్థం స్రవిస్తుంది. తెగులు ఒక పొలం నుంచి మరో పొలానికి వ్యాప్తి చెందుతుంది. పొలం గట్లు మీద కలుపు ఎక్కువుంటే మరింత వేగంగా వ్యాపిస్తుంది. వరి పంటలో వచ్చే తెగుళ్లతో అగ్గి తెగులు ప్రమాదకమైంది. అలాగే గింజ దశలో ఉన్న వరి పంటపై ప్రభావం చూపుతుంది. అగ్గి తెగులు సోకకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు.

వరిలో కాలిబాటలతో ప్రయోజనాలు..

వరి పంట సస్యరక్షణలో కాలిబాటలు తీసుకోవడం వల్ల పంటకు గాలి, వెలుతురు సక్రమంగా అందుతాయి. వరి పిలకలు దుబ్బు చేయడంతో పాటు, చీడ పీడల నుంచి ఎంతో రక్షణగా ఉంటుంది. అలాగే వరి పంటలో అన్ని వైపులా నుంచి ఎరువులు సమానంగా వేయడంతో పాటు సులభంగా పురుగు మందులు పిచికారీ చేయవచ్చు. వరి నాట్లు వేసేటప్పుడు మొలకలు దగ్గరగా నాటడం వల్ల తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉంది. వరి పంటలో సరైన గాలి, తేమ లేకపోతే చీడపీడలు వచ్చే అవకాశం ఉంది.

అగ్గి తెగులుతో నష్టం



ప్రస్తుతం వరి పంటకు అగ్గి తెగులు సోకడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నాం. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనలు అందించాలి.అగ్గి తెగులు ఒక పొలం నుంచి వేగంగా మరో పొలానికి వ్యాపిస్తుంది. తెగులు నివారణ కాకపోతే పంట పెట్టుబడి కూడా రాక పంట పూర్తిగా నష్టపోవాల్సి ఉంటుంది.

– నాగేంద్ర, రైతు, కమలాపురం

ముందు జాగ్రత్తలతో తెగుళ్ల నివారణ



రైతులు వరి పంట సాగు చేసే ముందు విత్తనశుద్ధి చేసుకోవాలి. అలాగే తూర్పు, పడమర కాలిబాటలు తీసుకోవడం వల్ల వరి పంటకు వ్యాపించే చీడపీడలు నివారించవచ్చు. రైతులు పొలం గట్లు మీద కలుపు మొక్కలు లేకుండా నివారించాలి. అగ్గి తెగులు సోకిన వరి పంటకు రైతులు పిప్రోఫైజన్ అనే రసాన మందులు పిచికారీ చేయాలి.

– సోమశేఖర్, ఏఓ

పరిశుభ్రత పాటించాలి



గుంతకల్లు కోర్టు ఆవరణలో చెత్తను ఊడుస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మంజుల



గుత్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

గుంతకల్లుటౌన్: మహాత్మాగాంధీ జయంత్యుత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టు ఆవరణలో జడ్జి ఎం.మంజుల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. జడ్జితో పాటు కోర్టు అధికారులు, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది కోర్టు ఆవరణలో చెత్తను ఊడ్చేశారు. పిచ్చిమొక్కలను తొలగించారు. కోర్టు సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యూనస్ అహమ్మద్, కోశాధికారి సురేష్, న్యాయవాదులు తిమ్మప్ప, తాజుద్దీన్, కోర్టు, పోలీసు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఏడీజే, మండల న్యాయసేవా సమితి చైర్మన్ శ్రీహరి , సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్‌చారి సూచించారు. పట్టణంలోని కోర్టుల ఆవరణలో శనివారం న్యాయమూర్తుల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు, మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం న్యాయవాదులు, మున్సిపల్ కమిషనర్ చీపర్లు చేతపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. కోర్టు ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం తొలగించారు. అనంతరం మొక్కలు నాటారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం



మాజీ ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: తిరుమల లడ్డూ రాద్ధాంతపై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయమని మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిపై దుష్ప్రచారానికి ఏకంగా కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకటేశ్వరస్వామిని అడ్డు పెట్టుకోవాడానికి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ వెనుకాడలేదని ఆరోపించారు. ఈ వందరోజుల్లో సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్క హామీని అమలు చేయకపోడంతో, ప్రజలను పక్కదారి పట్టించడానికి ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. కల్తీ జరిగిందా? లేదా? అనే విషయం నిర్ధారించకుండానే ముఖ్యమంత్రి చంద్రబాబు లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని చెప్పడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఈ వ్యహారంపై దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచాలంటూ అత్యున్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు కూటమి నేతలకు మింగుడు పడడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను రద్దు చేసి సీబీఐతో పాటు ఐదుగురు ప్రత్యేక అధికారుల బృందాన్ని న్యాయస్థానం ఏర్పాటు చేయడం శుభాపరిణామన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సునీత

బుక్కరాయసముద్రం: పీహెచ్‌సీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్ పర్సన్, ఎంపీపీ సునీత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి సలహా మండలి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆస్పత్రిలో సమస్యలను నివేదికల రూపంలో ఇవ్వాలని అధికారులను సూచించారు. వాటిని పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. అంతకుముందు ఆస్పత్రిలో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలు, నిధులపై చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వాతి లక్ష్మి, సీహెచ్‌ఓ మోహన్‌రావు, పీహెచ్‌ఎన్ చెన్నమ్మ, సీనియర్ అసిస్టెంట్ సునీత, ఫార్మాసిస్ట్ బాషా, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు, ధనుంజయ, కమిటీ సభ్యులు మనేరి కొండమ్మ, కల్పన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి, పామిడిలో భారీ వర్షం



సచివాలయ భవనం గోడ కూలిన దృశ్యం

గుత్తి: గుత్తి మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకూ భారీ వర్షం కురిసింది. 55.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎస్‌లో ఎస్ఎస్‌పల్లి రోడ్డులో ఉన్న సచివాలయం–2 అద్దె భవనం గోడ కూలింది. తెల్లవారుజామున గోడ కూలడం వల్ల ఎలాంటి ప్రాణాపాయం సంభవించలేదు. దీంతో సచివాలయ ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. భారీ వర్షానికి చెట్నేపల్లి జగనన్న కాలనీకి వెళ్లే రహదారి జలమయమైంది. లోతట్టు కాలనీ వాసులు రాత్రంతా జాగరణ చేయాల్సి వచ్చింది.

దంచికొట్టిన వాన

పామిడి: పామిడిలో శుక్రవారం రాత్రంతా వాన దంచి కొట్టింది. వర్షానికి డ్రైనేజీలు, కాలువలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలైన మదీనా కాలనీ, వెంగమనాయుడు కాలనీ, చైతన్యకాలనీ, వీకే ఆది నారాయణరెడ్డి కాలనీ, నాయీబ్రహ్మణ కాలనీల్లో వర్షపునీటితో ఇబ్బందిపడ్డారు.

నెట్టికంటుడిని దర్శించుకున్న దివ్యజ్ఞానానందగిరి స్వామిజీ



స్వామీజీకి తీర్థప్రసాదాలను అందజేస్తున్న ఈఓ వాణి

గుంతకల్లు రూరల్: తొగటవీర క్షత్రియుల కులగురువు దివ్యజ్ఞానానందగిరీ స్వామీజీ (పుష్పాండజ మహర్షి గురుపీటం దొడ్డబళ్లాపూర్) కసాపురం నెట్టికంటి ఆంజనేస్వామిని దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఈఓ వాణి, సిబ్బంది, అర్చకులు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు స్వామీజీకి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఉచిత ఇసుక హామీ అమలు చేయాలి



దీటీకి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

శింగనమల: కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌రావుకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం నియోజకవర్గ కార్యవర్గ సభ్యుడు భాస్కర్ మాట్లాడుతూ ఇసుక అందుబాటులో లేకపోవడంతో, నిర్మాణ పనులు నిలిచి పోయాయన్నారు. దీంతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసులు, పుల్లన్న, రుషింగప్ప, చంద్ర, కొండారెడ్డి, సుంకన్న, రామాంజినేయులు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్టార్టర్ల రికవరీ



రికవరీ చేసిన స్టార్టర్లను రైతులకు అందజేస్తున్న పోలీసులు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో చోరికి గురైన విద్యుత్ స్టార్టర్లను రికవరీ చేసి శనివారం రైతులకు అందజేసినట్లు సీఐ కొలుట్లయ్య తెలిపారు. సీఐ మాట్లాడుతూ ఇటీవల గార్లదిన్నె, కల్లూరు, మర్తాడు గ్రామాల్లోని పొలాల్లో స్టార్టర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారన్నారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా మర్తాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారు స్టార్టర్లను గుజిరీలో విక్రయించి సొమ్ము చేసుకున్నామన్నారు. గార్లదిన్నె, అనంతపురం గుజిరీ షాపుల్లో విచారించి చోరీ చేసి విక్రయించిన స్టాటర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, 10 స్టాటర్లలను రైతులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులతో సమావేశం

పామిడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని రామరాజుపల్లి రైతులతో సమావేశమయ్యారు. ఆ గ్రామ పొలాల్లో 400 కేవీ విద్యుత్‌లైన్ ఏర్పాటులో భాగంగా రైతులతో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం విద్యుత్ లైన్ వెళ్లే పొలాల మార్కెట్ రేటు ఎంత? పరిహారం ఎంత కావాలని రైతులను అడిగి తెలుసుకున్నారు. జీఓ 83 ప్రకారం రైతుల నుంచి సేకరించిన మార్కెట్, డిమాండ్ రేటు వివరాల నివేదికను కలెక్టర్ వినోద్‌కుమార్‌ను నివేదించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో 400 కేవీ విద్యుత్ కార్యాలయ ఏఈ సునీల్, రైతులు దేవేంద్రరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, ముత్యాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పెద్దపప్పూరు: మండలంలోని జోడిదర్మాపురం టోల్‌ప్లాజా వద్ద పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశామని ఎస్ఐ గౌస్‌బాషా శనివారం తెలిపారు. తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన హరికృష్ణ, రాజారెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు. పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలించకుండా ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

గుత్తి: పట్టణంలోని అమృత్ సినిమా థియేటర్ వెనుక ఎస్సీ కాలనీలో శనివారం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించారు. దాడుల్లో అక్కడ మట్కా రాస్తున్న ముగ్గురు బీటర్లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 40,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ఆయుధం



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

గుంతకల్లు: ప్రజాస్వామ పరిరక్షణకు యువత ఓటు హక్కును ఆయుధంగా మలుచుకోవాలని తహసీల్దార్ రమాదేవి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక శంకరనంద గిరిస్వామి డిగ్రీ కళాశాలలో ఓటు నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ షేక్షావలి, ప్రిన్సిపాల్ గోపాల్, అధ్యాపకులు బసెట్టి కృష్ణయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్క నాటుతున్న బ్యాంక్ మేనేజర్ మురళీకృష్ణ

శింగనమల: పర్యావరణ పరిరక్షణకు అందరం కృషి చేద్దామని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మురళీకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని తరిమెల గ్రామంలోని బ్యాంక్ ఆవరణలో మొక్కలు పెంపకం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది గురివిరెడ్డి, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు శిక్షణ



మాట్లాడుతున్న ట్రాక్టర్ నగర్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బాలాజీ మురారి నాందేడే

గార్లదిన్నె: మండలంలోని మర్తాడులో మూడు రోజులు నుంచి దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు యంత్ర పరికరాలపై శిక్షణ ఇచ్చినట్లు డైరెక్టర్ బాలాజీ మురారి నాందేడే తెలిపారు. శిక్షణ అనంతరం మహిళలకు సర్టిఫికెట్‌తో పాటు రూ.525 భృతి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అగ్రికల్చర్ ఇంజనీర్ విజయ్‌కుమార్, అగ్రికల్చర్ ఇంజనీర్ నితీష్ వర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూలి ధరలు పెంచాలి

తాడిపత్రి రూరల్: ఎంఎల్ఎస్ పాయింట్‌లో పనిచేస్తున్న హమాలీలకు కూలి ధరలు పెంచాలని సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో శనివారం హమాలీలు కలసి ఇన్‌చార్జ్ శంకరయ్యకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం నాయకుడు జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ హమాలీలు 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నా సరైన సౌకర్యాలు లేవన్నారు. మౌలిక సదుపాయలతోపాటు ఆరోగ్య భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఎం నాయకులు హనుమంతరెడ్డి, రామ్మోహన్, నాగరాజు, శ్రీరాములు, హమాలీ యూనియన్ నాయకులు ఉన్నారు.

పరమ పావనీ పాహిమాం



గుంతకల్లులో శ్వేత వారాహిదేవిగా వాసవీ మాత



గుంతకల్లు రూరల్: మహేశ్వరీ దేవిగా కొల్హాపూర్ మహాలక్ష్మి



గుత్తి రూరల్: సేవాగఢ్‌లో అన్నపూర్ణేశ్వరి అలంకరణలో మాతా జగదాంబ



తాడిపత్రిటౌన్: అలంకరణలో సుంకులమ్మ కాళికాదేవి



గుత్తిలో వేంకటేశ్వరస్వామిగా వాసవీ మాత



శింగనమల: భగవతీదేవిగా దుర్గాదేవి

సాక్షి నెట్‌వర్క్: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో నవరాత్రుల మహోత్సవాలు మూడో రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల ఆవరణలో కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

కొనసాగుతున్న పప్పుశనగ రిజిస్ట్రేషన్

యల్లనూరు: మండలంలోని యల్లనూరు, పాతపల్లి, వెన్నపూసపల్లి గ్రామాల్లో 615 రైతులు 499.50 క్వింటాళ్ల పప్పుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఏఓ రామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సోమ, మంగళ, బుధవారాల్లో కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పుట్లూరు: మండలంలో పప్పుశనగ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల వద్ద రిజిస్ట్రేషన్ ప్రక్రియ శనివారం రెండో రోజూ కొనసాగింది. మండలవ్యాప్తంగా 1,132 మంది రైతులు 1,573 క్వింటాళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఏఓ కాత్యాయని తెలిపారు.

విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులు

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సమగ్ర శిక్ష స్కిల్ డెవలెప్‌మెంట్, టైమ్స్ సెంటర్ ఫర్ లెర్నింగ్ ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ -2 పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఆయన తిమ్మంపల్లి జెడ్పీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కింద సచివాలయంలో పలు రకాల కోర్సులను ఉపాధ్యాయుడు వెంకటేష్ నిర్వహిస్తారన్నారు. సచివాలయ సిబ్బంది విద్యార్థులకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు.